క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌కు మగ్గిడి విద్యార్థిని



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వేదగిరి నిషిత వైజాగ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కూల్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత సోమవారం తెలిపారు. రెండు నెలల క్రితం వాలీబాల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నిషిత ఉత్తమ ప్రతిభ కనబర్చి వైజాగ్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిషితను హెచ్‌ఎం హరిత, పీఈటీ మధు అభినందించారు.

మీ- సేవ మండల అధ్యక్షుడి ఎన్నిక



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల మీ–సేవ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మీ సేవ నిర్వాహకుడు మీర శ్రావణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆర్మూర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన మీ–సేవ నిర్వాహకుల సమావేశంలో ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం విజయ్, కార్యదర్శిగా మీసాల సురేష్, కోశాధికారిగా పుట్ట నవీన్, సలహాదారులుగా జేకే మనోజ్, బాలిక్, స్వప్న, సాబేర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని మీ సేవా జిల్లా కన్వీనర్ మొహమ్మద్ షాహిద్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. నాయకులు పాన్న శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా, కూరగాయల మార్కెట్, అంబేడ్కర్ చౌరస్తా, పెర్కిట్, మామిడిపల్లి చౌరస్తాల వద్ద సోమవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, నీరు తాగుతూ ఉండాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ ఏఈ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

బాల్కొండ: బోదేపల్లి గ్రామానికి చెందిన బి. నివేదిత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి వైద్యం కోసం రూ.2.5 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ కాపీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. వారు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహన



రుద్రూర్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈపీఆర్ పవన్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో చేపట్టబోయే నాలుగు కాంపోనెంట్లపై అవగాహన కల్పించారు. మండల విద్యాధికారి శాంతకుమారి మాట్లాడుతూ.. 16 పాఠశాలల్లో ఈ కమిటీలు ఉన్నాయని, ఇక్కడ తాగు నీరు, టాయిలెట్స్, విద్యుత్, మేజర్, మైనర్ రిపేర్లను పాఠశాల పునః ప్రారంభంలోపు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో సురేష్ బాబు, పీఆర్ డీఈ రాజేశ్వర్, ఐకేపీ ఏపీఎం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



వర్ని(మోస్రా): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న దూపల్లి సాయిలు(45) ఆదివారం రాత్రి మృతి చెందడంతో సోమవారం ఉదయం ప్రభుత్వం తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అంత్యక్రియల నిమిత్తం బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం నుంచి కార్మికుడికి రావాల్సిన అన్ని రకాల సదుపాయాలను అందజేస్తామని వెల్లడించారు. ఎంపీవో రఫీ, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ ఉన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

- దేశానికి బీజేపీ చేసింది ఏమీ లేదు
- రూ. 2 లక్షల రుణ మాఫీకి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది
- ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి



కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): కాంగ్రెస్ కార్యకర్తల ఉత్సాహం చూస్తే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమనిపిస్తోందని మ్మెల్సీ, నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్‌లో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధానిలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు ఉద్యమించినా మోదీ నోరు విప్పి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు తీసుకున్న పంట రుణాలను కట్టనవసరం లేదని, బ్యాంకులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూచీకత్తుగా ఉంటుందని వెల్లడించారు. ఖరీఫ్ పంటకు బ్యాంకులో రుణం వచ్చేలా సీఎం చర్యలు చేపడుతున్నారని రైతులు అధైర్య పడరాదని పేర్కొన్నారు. నిజాం చక్కర కర్మాగారాన్ని 2001లో మూసి వేసింది నాడు మిత్ర పక్షంగా ఉన్న టీడీపీ- బీజేపీ ప్రభుత్వమని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో నడుస్తున్న ఫ్యాక్టరీని 2015లో మూసి వేయించిన ఘనత నాటి ఎంపీ కవితకే దక్కిందన్నారు. ఎంపీగా గెలిచిన అర్వింద్ చక్కెర కర్మాగారాన్ని ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించిన ప్రధాని మోదీ, నిజామాబాద్‌లో పార్లమెంట్ పరిధిలో పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో ఎంపీ చెప్పాలని ప్రశ్నించారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖామన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి

ఎడపల్లి/బోధన్‌టౌన్: ఎడపల్లి మండలంలోని నెహ్రూ నగర్‌లో, బోధన్ పట్టణంలోని అప్సా ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తుంది

– ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



గత పదేళ్ళ పరిపాలనలో ఇంటికో ఉద్యగం ఇస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం, 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం, రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పుల కుప్పగా చేసి ఇంటింటికి బాకీని మోపారని ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. 10 ఏళ్ల కేసీఆర్, మోదీ పాలన నాటి బ్రిటీష్, రజాకార్ల పాలనను తలపించిందని విమర్శించారు. 3వ సారి బీజేపీ దేశంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగించడం ఖాయమని వ్యాఖ్యానించారు. దేశ రాజధానిలో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తే ఫిరంగులతో మోదీ ప్రభుత్వం రైతులను కాల్చిందని ఆరోపించారు. జీఎస్టీ వసూళ్ల పేరిట ప్రజలపై పెను భారాన్ని కేంద్ర ప్రభుత్వం మోపుతుందని అన్నారు. ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఇంటింటికి తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏమి చేసింది.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రాబోవు మూడు రోజుల్లో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. హున్స, మందర్న, ఖాజాపూర్ గ్రామాల్లో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టామని తెలిపారు. పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డికి నియోజకవర్గంలో లక్ష కంటే ఒక్క ఓటు తగ్గద్దని, నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని పీఎంను చేద్దామని పిలుపు నిచ్చారు. అనంతరం కార్యకర్తల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ రజితా యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావ్, ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ గంగాధర్‌రావ్ పట్వారీ, నాయకులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దిన్, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రాధాన్యత పనులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాజేశ్వర్

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యత గల పనులను వెంటనే గుర్తించాలని మండల విద్యాధికారి రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలలపై హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్కొండ, మెండోరా మండలాల్లో 15 పాఠశాలలు, ముప్కాల్ మండలంలో 11 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలు ఎంపికైనట్లు తెలిపారు. ఆ పాఠశాలలో కనీస అవసరాలైన తాగు నీరు, విద్యుద్దీకరణ, మైనర్ రిపేర్లు లాంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంపీటీవోలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ముజాఫరొద్దీన్, వనజ, ఏఈలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

బాల కవి సమ్మేళనం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని తడపాకల్ ఉన్నత పాఠశాలలో క్రోధి నామ సంవత్సరం సందర్భంగా సోమవారం ఇందూర్ జిల్లా బాల సాహిత్య సమితి ఆధ్వర్యంలో బాల కవి సమ్మేళనం నిర్వహించారు. 25 మంది విద్యార్థులు పాల్గొని ఉగాది ప్రత్యేకతను, తెలుగువారి పండుగలలో ఉగాది పండుగకు ఉన్న ప్రాధాన్యతను కవితల రూపంలో వివరించారు. తెలుగు పండిట్ ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ.. బాల కవి సమ్మేళనంల ద్వారా బాలల్లో దాగి ఉన్న సాహిత్య ప్రతిభను వెలికి తీయవచ్చునని చెప్పారు. ఉపాధ్యాయులు రాములు, సుధాకర్, గంగాధర్, నాగప్ప, రవి, కృష్ణప్రసాద్, నరేందర్, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐపీఎస్‌యూ నూతన డివిజన్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులు

బోధన్: అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏఐపీఎస్‌యూ) డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జి బోడ అనిల్ తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడిగా శివాజీ, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, సభ్యులుగా పవన్, సాయి, తరుణ్, శివలను ఎన్నుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై సమావేశంలో చర్చించామని వివరించారు.పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తేమ శాతం తక్కువ ఉండేలా చూడాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో అబ్దుల్ మాలిక్

మోర్తాడ్: కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం తరలించేవారు తేమ 17 శాతానికి మించి ఉండకుండా చూడాలని ఏర్గట్ల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు. సోమవారం ఏర్గట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తేమ శాతం తక్కువగా ఉంటే ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏర్గట్ల సహకార సంఘం సీఈవో జక్కని శ్రీనివాస్, సెంటర్ ఇన్‌చార్జీలు సతీష్‌గౌడ్, సాయి పవన్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి



వంట చేస్తూ భవానీ కాలనీవాసుల నిరసన

బాల్కొండ: మండల కేంద్రంలో సర్వే నంబర్-1402లో గల లేఅవుట్ వెంచర్‌లో జీపీకి వదిలిన 10 శాతం భూమిని ఆక్రమించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం భవానీ కాలనీవాసులు జీపీ ఆవరణలో వంట – వార్పు చేసి నిరసన తెలిపారు. అధికారు లు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. జీపీ స్థలంలో గతంలో ఉన్న గ్రామ పంచాయతీ భూమి అని రాసిన బోర్డును పాతాలని డిమాండ్ చేశారు. బాల్కొండ పోలీసులు జీపీకి చే రుకుని ఎన్నికల కోడ్ ఉన్నందున నిరసనలు, ధ ర్నాలు చేయవద్దని సూచించారు. బోర్డు రాసి పె డతామని జీపీ ఈవో రజనీకాంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కాలనీవాసులు వెనుదిరిగారు.

ఉత్తమ బిల్‌కలెక్టర్‌లకు సన్మానం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నులు వసూలు చేసిన ఉత్తమ బిల్ కలెక్టర్‌లను మున్సిపల్ కమిషనర్ రాజు సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో ఇంకా బాగా పనిచేయాలని కోరారు. అనంతరం శాలువ, ప్రశంస పత్రాలతో సత్కారించారు. మున్సిపల్ మేనేజర్ హయూమ్, సీనియల్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదు



కమ్మర్‌పల్లి: అమీర్‌నగర్, బషీరాబాద్, చౌట్‌పల్లి గ్రామాల్లో సోమవారం ధర్మ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మహిపాల్ మహరాజ్, మండలాధ్యక్షుడు కైలాష్ మహరాజ్, బాబూరావ్, నాగేశ్వర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నవీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాలతో పాటు మోకన్‌పల్లిలోని కేజీబీవీలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. కంటి జబ్బులతో బాధపడుతున్న 292 మంది విద్యార్థులను పరీక్షించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అరవింద్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మల్లేష్, సూపర్ వైజర్లు కిషన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

మోకన్‌పల్లి గ్రామ శివారులోని చెరువులో పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలకు వైద్య సిబ్బంది వడదెబ్బపై సోమవారం అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రమైన నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సంధర్భంగా కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం

బోధన్‌టౌన్(బోధన్): తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించడానికి బోధన్ మున్సిపాలిటీ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాలో ఏవైనా ఇబ్బందులు, సమస్యలు, పైప్‌లైన్ లీకేజీలుంటే తెలపాలన్నారు. మక్కయ్య, వాటర్ సప్‌లై సూపర్ వైజర్ ఫోన్ నెం: 99089 32817, పాషా ఫోన్ నెం: 95539 288580, సాయాగౌడ్ ఫోన్ నెం: 99632 90682లకు ఫోన్ చేసి సమస్యల్ని వివరిస్తే పరిష్కరిస్తామన్నారు.

మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన

డొంకేశ్వర్(ఆర్మూర్): అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో గ్రోమోర్ కంపెనీ ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు, సేంద్రీయ ఎరువుల వాడకంపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రోమోర్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేసుకోవడం వల్ల భూసారం ఎంతుందో తెలుసుకోవచ్చన్నారు. సేంద్రీయ ఎరువులను వినియోగించడం వల్ల భూమికి మేలు జరుగుతుందన్నారు. మహేశ్వర్ రెడ్డి, ప్రణయ్, రాజు, రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్ జాదవ్

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ రూరల్ పరిధిలో 30, సాలూరు మండలాల పరిధిలో 10 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లకు బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్ మాట్లాడుతూ.. కమిటీల సహకారంతో పాఠశాలల్లో మౌ లిక వసతులను మెరుగుపరచనున్నామన్నారు. ఎంఈవో నాగనాథ్ మాట్లాడుతూ.. వేసవి సెలవులలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యా యులు అందుబాటులో ఉండాలని, రూ.లక్ష లోపు నిధులు ఎంపీడీవో సహకారంతో రూ.లక్ష పైన కలెక్టర్ సహకారంతో పాఠశాలలో పనులు ప్రారంభించాలన్నారు. ఏఈ సాయిలు, బోధన్ మండల నోడల్ అధికారి నాగయ్య, సాలూరా మండల నోడల్ అధికారిణి రాజ మంజూష, ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు సీఆర్పీలు పాల్గొన్నారు.

‘అమ్మ’లకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

రెంజల్(బోధన్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్, ఏఈవో గణేశ్ రావ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 17 పాఠశాలల్లో ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులతో కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ప్రతీ పాఠశాలలో కమిటీ ప్రతినిధులు జాయింట్ బ్యాంక్ ఖాతాలను తీయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో చేపట్టాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు సోమలింగంగౌడ్, ఏఈ సాయిచంద్, ఎంపీవో గౌస్, ఏపీఎం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వర్ణోత్సవాలు ప్రారంభం



రెంజర్లలోని కోదండ రామాలయం



1974లో శ్రీరామాలయ ప్రతిష్ఠ వేడుకల్లో గ్రామస్తులు

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో స్వర్ణోత్సవాలకు కోదండ రామాలయం ముస్తాబైంది. గ్రామంలో చెరువు ముందర గల స్థలంలో ఓ గ్రామస్తుడు 1974లో చిన్న రాయిని పెట్టి శ్రీరాముడిగా పూజించడంతో అప్పటి నుంచి గ్రామస్తులకు కొంగు బంగారంగా వెలుగొందుతున్నాడు. 50 ఏళ్ల ఉత్సవాలకు ఆలయం ముస్తాబు చేయడంతో పాటు ఉత్సవాలకు ఏర్పాట్లను సిద్ధం చేశారు.

రామకోటి స్థూపం నిర్మాణం..

ఆలయం నిర్మించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రాంగాణంలో రామ కోటి స్థూపాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

30 ఏళ్లుగా మాలధారణ..

కోదండ రామాలయంలో 30 ఏళ్లుగా భక్తులు 41 రోజుల పాటు మాలధారణ చేస్తున్నారు. కఠినమైన నియమాలతో 41 రోజులు, 21 రోజులు మాలధారణ చేసి సీతారామలక్ష్మణ సేవలో తరిస్తున్నారు. ప్రతి సంవత్సరం కనీసం 30 మందికి తగ్గకుండా మాలధారణ చేపడుతున్నారు.

ఏటా మాల వేసుకుంటా



కోదండ రామాలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామ మాలధారణ చేపడతాను. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందాడు. ఆలయ అభివృద్ధి కోసం కూడ గ్రామస్తులు వెనకడుగు వేయకుండా చేపడుతాం. ఆనందంగా ఉంటుంది.

– బుల్లెట్ రాంరెడ్డి, భక్తుడు

అన్ని ఏర్పాట్లు చేశాం



వేద పండితుల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలను నిర్వహించటానికి ఏర్పాట్లు చేశాం. రామ కోటి స్థూపం నిర్మించడం గర్వంగా ఉంది. శ్రీరామునికి సేవ చేసుకునే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఉత్సవాలకు అంతా సిద్ధంగా ఉంది.

– నాగరాజు, ఆలయ అర్చకుడు, రెంజర్ల

‘ఉగాది’ ఉత్సవాలకు ముస్తాబు



బాల్కొండ: ముప్కాల్ మండలంలోని నాగంపేట్‌లోని వేంకటేశ్వర ఆలయం మంగళవారం నిర్వహించే ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినాన వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు నిర్వహించి కల్యాణోత్సవం జరుపుతారు. ఇప్పటికే ఆలయాన్ని మిరిమిట్లు కొలిపే లైట్లతో అలంకరించారు. 41 రోజుల క్రితం భక్తులు వేంకటేశ్వరుని మాల ధరించి నిత్య పూజలు ప్రారంభించారు. రెంజర్ల, నాగంపేట్ గ్రామస్తులు అధికంగా తరలి వచ్చి పూజలు చేస్తారు. అలాగే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాల్కొండ మండల కేంద్రంలోని లింగమయ్య ఆలయం కూడా ముస్తాబైంది.

సమాచారం..

నేడు కుస్తీ పోటీలు

రెంజల్(బోధన్): కల్యాపూర్, బోర్గాం గ్రామాల్లో మంగళవారం కుస్తీపోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతీ సంవత్సరం కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కల్యాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గాండ్ల నాగరాజు తెలిపారు.

ఒడ్డేటమ్మ జాతర

మాక్లూర్: ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం(నేడు) ఒడ్డేట్‌పల్లిలో గల ఒడ్డేటమ్మ ఆలయంలో ప్రత్యేక జాతర ఉంటుందని ఆలయ చైర్మన్ మీసాల రవి సోమవారం తెలిపారు. ఆనవాయితీ ప్రకారం ముందుగా ఒడ్డేటమ్మ విగ్రహాన్ని గ్రామ పెద్ద కాపు ఇంటి నుంచి డప్పు వాయిద్యాలతో ప్రదర్శనగా ఆలయానికి చేర్చుతారని తెలిపారు. అన్నదానం కూడా ఉంటుందని తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.20, 4.45, 10.10
	భరతనాట్యం - 2.00, 7.25
స్కీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 –	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) - 11.25, 2.50, 6.15, 9.40
స్క్రీన్-4 –	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) - 11.25, 2.50, 6.15, 9.40